క్లుప్తంగా

సైనిక సంక్షేమ నిధికి విరాళం



విరాళం అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లాలోని సైనికులు, మాజీ సైనిక కుటుంబాలకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తన వంతు చందాను జిల్లా సైనిక సంక్షేమ అధికారి కేవీ సాయిప్రసాదరావుకు అందజేశారు. ఎన్‌సీసీ కేడెట్స్, జిల్లా సైనిక సంక్షేమ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ చదువుతున్న స్థానిక పడమర వీధికి చెందిన కొండపల్లి రమణి, లావణ్యలకు బుధవారం డీఈఓ పి.శ్యామ్ సుందర్ చేతుల మీదుగా రూ.10 వేలు ఆర్థిక సాయం శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ప్రతినిధులు అందజేశారు. దాతల ఆశయాల మేరకు విద్యార్థినులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని డీఈఓ సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు జి.మోహన్, డీకేఎస్ఎస్ ప్రకాష్, గుంటూరు శ్రీనివాస్, ఎంవీ సురేష్ కుమార్, యుద్ధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన, వృవస్థాపన అభివృద్ధి సంస్థ (సీడ్‌యాప్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి ఉపాధి కల్పనలో భాగంగా జర్మనీలో ఉపాధి కోసం బీఎస్సీ నర్సింగ్ పూర్తయిన మహిళా అభ్యర్థులకు టీటీడీసీ వట్లూరులోని స్కిల్ కాలేజీలో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు తెలిపారు. శిక్షణలో ఉచిత భోజన, వసతి, ఏకరూప దుస్తులు, శిక్షణ సామగ్రి అందజేస్తామని చెప్పారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తయి, 20 నుంచి 35 ఏళ్లలోపు గ్రామీణ మహిళా అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులన్నారు. విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, మనుగడలో ఉన్న పాస్‌పోర్టు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా, వయసు నిర్ధారణ, కుల ధ్రువీకరణ పత్రం నకళ్లను అందజేయాలని కోరారు. అభ్యర్థులు డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు రమాదేవి జాబ్ కో-ఆర్డినేటర్ సెల్ నెంబర్ 93928 19393, చంద్రకళ సెల్ నెంబర్ 80965 80841కు సంప్రదించాలని కోరారు.

బీఎస్ఎన్ఎల్ బిల్లులు పరిష్కరించుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ బిల్లుల బకాయిలు ఈనెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జిల్లా టెలికాం జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నోటీసులు పొందిన వినియోగదారులు తమ పరిధిలోని లోక్ అదాలత్ కోర్టుల్లో పరిష్కరించుకోవాలని కోరారు. బకాయిలను ముందుగానే చెల్లించదలచిన వారు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 94947 08898, 94903 12777లో సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: విద్యతోనే సమాజంలో ప్రతి కుటుంబం అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. 133వ రోజు ఏలూరు ఎన్ఆర్‌పేట 20వ డివిజన్‌లో బుధవారం కార్పొరేటర్ గూడూరి ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు గూడూరి విజయప్రసాద్ ఆధ్వర్యంలో నాని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి పేదవానికీ నాణ్యమైన విద్యను అందించేందుకు విశేష కృషి చేస్తున్నారని వివరించారు. నేడు రాష్ట్రంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారని, నాడు - నేడుతో ప్రభుత్వ బడుల రూపురేఖలు సమూలంగా మార్చుచేశారని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నో ఆడ్మిషన్స్ బోర్డులు పెట్టే స్థాయికి అభివృద్ధి చేశామని చెప్పారు. జగనన్న విద్య దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్య కానుక, విదేశీ విద్య పథకం ద్వారా పేదలకు ఉన్నత విద్యను చేరువచేశారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ క్లస్టర్-1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, పొలిమేర దాసు, పార్టీ యువజన నాయకులు నిడికొండ నరేంద్ర, పొలిమేర హరికృష్ణ, పిట్టా ధనుంజయ్, యల్లాపు మోజెస్, టూటౌన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అమీనా అన్సారి, మున్ని, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.



ఎన్ఆర్‌పేటలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని



సమీక్షకు హాజరైన అధికారులు, సచివాలయ ఉద్యోగులు

నగరాభివృద్ధే లక్ష్యం

ఏలూరు నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన 50, 12వ సచివాలయాల పరిధిలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో ప్రజా వినతుల పరిష్కారంపై బుధవారం సమీక్షించారు. 50వ సచివాలయం పరిధిలో రూ.60 లక్షలు, 12వ సచివాలయం పరిధిలో రూ.54 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను ఆమోదించారు. సమీక్షలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ నగరంలోని ఆయా ప్రాంతాల్లో స్థానిక సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు శ్రీనివాస్, సుధీర్‌బాబు, కార్పొరేటర్లు తంగెళ్ల రాము, పప్పు ఉమామహేశ్వరరావు, పార్టీ యువజన నాయకులు నిడుకొండ నరేంద్ర, పార్టీ జిల్లా కోశాధికారి మైబాబు తదితరులు ఉన్నారు.

ఆపన్నులకు అండగా..



బాధితురాలికి రూ. 5 వేలు పెన్షన్ అందజేస్తున్న పార్టీ నాయకులు

ఏలూరు టౌన్: పక్షవాతంతో మంచానికే పరిమితమైన ఏలూరు జనపరెడ్డివారి వీధికి చెందిన నాగులపల్లి అశోక్‌కుమార్ (45)కు రూ.5 వేలు పెన్షన్ మంజూరు కావడంతో స్థానిక నాయకుడు జనపరెడ్డి కృష్ణ బుధవారం అందజేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని అశోక్‌కుమార్ ఇంటికి వెళ్లి వారి దీన స్థితిని తెలుసుకున్నారు. తమకు పింఛన్ మంజూరు చేయాలని కోరిన వెంటనే ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులు అతని ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి పెన్షన్ మంజూరు చేశారు. అశోక్‌కుమార్ ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్ గణేశ్వరి, వెల్ఫేర్ సెక్రటరీ ప్రవీణ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ మేరిప్రశాంతి



హోంగార్డ్ చిరంజీవిని సత్కరిస్తున్న ఎస్పీ

ఏలూరు టౌన్: ప్రజా సేవే పరమావధిగా హోంగార్డులు అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ మేరిప్రశాంతి అన్నారు. ఏలూరు పోలీస్ అధికారుల భవనంలో బుధవారం నిర్వహించిన 61వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జిల్లాలోని హోంగార్డులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సారథ్యంలో ఏలూరు రేంజ్‌లో ఎస్సై పోస్టుల సెలక్షన్స్‌లో, విధుల్లో ఉత్తమ సేవలందించిన పలువురు హోంగార్డులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఏలూరు సబ్‌యూనిట్‌లో పదవి విరమణ చేయబోతున్న హోంగార్డ్ చిరంజీవిని ఘనంగా సత్కరించారు. పదవి విరమణ చేసిన హోంగార్డ్ కేజీఎం రత్నంకు రూ.5,00,480, హోంగార్డ్ ఎం.రామ శ్రీనివాసరావుకు రూ. 5,47,410 చెక్కులను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, ఎస్‌బీ సీఐ బి.ఆదిప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, దుర్గాప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు, హోంగార్డులు హాజరయ్యారు.

భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శం



పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు



ఎస్సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి



పైడిచింతపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన సంజీవ్‌కుమార్

ఏలూరు (టూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. జైభీమ్‌ఏవాత ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ విప్పర్తి ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజయరాజు మాట్లాడారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, నగర కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, మాల మహాసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బూరి అనిల్, మాల మహాసేన జాతీయ అధ్యక్షుడు అలగ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో..**

అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రపంచ ప్రథమ శ్రేణి మేధావి బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. మానవత ఏలూరు అధ్యక్షులు మేతర అజయ్ బాబు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు, బొద్దుల వేణు, చాటపల్లి శ్రీనివాసరావు, రత్నబాబు, సత్యనారాయణ, దుర్గారావు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

● **బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి**

ఎస్సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి పరితపించిన ఏకైక వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కొరబండి బాబూరావు, నూకపెయ్యి కార్తీక్, గారపాటి నాగేశ్వరరావు, జి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

● **ఎస్సీ, ఎస్టీ నాయకుల ఆధ్వర్యంలో..**

పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని జాతీయ సీనియర్ ఎస్సీ నాయకులు పొలిమేర హరికృష్ణ అన్నారు. కార్యక్రమంలో పాకా ప్రభాకరరావు, సొంగ మధుసూదన్‌రావు తదితరులుపాల్గొన్నారు.

● **చేతివృత్తిదారుల సంఘ కార్యాలయంలో..**

అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అంటరానితనం, కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక విప్లవకారుడు అంబేడ్కర్ అని బీసీ సబ్ ప్లాన్ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కోకన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావు అన్నారు. హిందూత్వ కార్పొరేట్ శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే బీఆర్ అంబేడ్కర్‌కు ఇచ్చే నిజనమైన నివాళి అని వారు పేర్కొన్నారు.

● **సీపీఎం జిల్లా కార్యాలయంలో..**

లౌకికరాజ్యాంగాన్ని కాపాడుకోవడమే అంబేడ్కర్‌కిచ్చే ఘన నివాళి అని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో రవి మాట్లాడారు. నాయకులు పి.రామకృష్ణ, బి.సోమయ్య, బి.జగన్నాథరావు, వి.సాయిబాబు, కోటేశ్వరరావు, మీసాల సత్యనారాయణ, త్రినాథ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో అంబేడ్కర్ ఆశయాల అమలు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుతున్నాయని రాష్ట్ర వడ్డీల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ అన్నారు. పైడిచింతపాడులో ఆయన గ్రామ ఎస్సీ పెద్దలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని ముంగర చెప్పారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంగర తిమోతీ, ఉపసర్పంచ్ రేలంగి యోహాన్, పల్లెం రాజు, చమలమూడి ఇమ్మానియేలు, పెరుమాల రాజు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో యూటీఎఫ్ సమావేశాలు



పోస్టర్ విడుదల చేసిన యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 9,10 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్నట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం పోస్టర్‌ను యూటీఎఫ్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక చలసాని గార్డెన్స్‌లో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 9న యూటీఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి చలసాని గార్డెన్ వరకు ర్యాలీ, అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. సభలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, ఏలూరు కార్పొరేషన్ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌పీ మనోహర్ కుమార్, బి.సుభాషిణి, నాయకులు కె.శ్రీనివాసరావు, షేక్ ముస్తఫా అలీ, ఆర్ రవికుమార్, జీవీ రంగమోహన్, ఎస్ సుధారాణి, కె.కమల్ కుమార్, బి.మోహనరావు, తేరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదల సంక్షేమం



46వ డివిజన్‌లో పార్టీ జెండా ఎగురవేసిన మైబాబు, స్రవంతి



11వ డివిజన్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన చంద్రశేఖర్, శ్రీదేవి

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల కోసమే పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ అన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని 11వ డివిజన్, టూటౌన్‌లోని 46వ డివిజన్‌లో మా నమ్మకం నువ్వే జగన్, వార్డు పోదాం అనే కార్యక్రమాలు నిర్వహించారు. 46వ డివిజన్‌లో క్లస్టర్-3 పార్టీ అధ్యక్షుడు మంచెం మైబాబు, క్లస్టర్-3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, కార్పొరేటర్ అయేషా సుల్తానా ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. రూ.26 కోట్ల సంక్షేమ పథకాలను తెలిపే బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సొమ్ములు జమయ్యేలా చేయటం ద్వారా దళారులకు చెక్ పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ నాయకులు రియాజ్ ఆలీఖాన్, యువజన విభాగం నాయకులు ఈదుపల్లి పవన్, నగరపాలక సంస్థ మేనేజర్ మూర్తి, టీఎల్ఎస్ టూటౌన్ అధ్యక్షురాలు అమీనా అన్సారీ, ఆలీషా తదితరులు ఉన్నారు.

11వ డివిజన్‌లో..

పార్టీ క్లస్టర్-1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్, క్లస్టర్-1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందకుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. రూ.21.83 కోట్ల సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. చంద్రబాబు హయాంలో పేదలకు ఒక్క రూపాయి సంక్షేమ పథకాలను ఇచ్చారా అని వారు ప్రశ్నించారు. నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోయ సత్తిబాబు, సచివాలయ కన్వీనర్లు పాలేటి రామాంజనేయులు, పట్టపు గణేష్, పార్టీ ఉపాధ్యక్షురాలు రాధ, విజయ్, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నేతలు ఉన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఏలూరు రూరల్: తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వ అన్ని విధాలుగా ఆదుకుంటుందని మండల వ్యవసాయశాఖ అధికారిణి జీవనసంధ్య అన్నారు. బుధవారం తహసీల్దార్ జె.శ్రీనివాసరావుతో కలిసి ఆమె మల్కాపురంలో పర్యటించారు. రైతులు నేలకొరిగిన పంట చేలను అధికారులకు చూపించారు. ఆదుకోవాలని కోరారు. తడిచిన పంటపై ఉప్పు ద్రావణం చల్లాలని అధికారులు రైతులకు సూచించారు. ఇదిలా ఉండగా పోణంగిలో సుమారు 1144 ఎకరాల్లో వరిసాగు చేయగా, ఇందులో ఇందులో 100 నుంచి 150 ఎకరాల్లో వరి పనలు నీట మునిగాయి. మరో 500 ఎకరాల్లో చేలు నేలకొరిగాయి. పోణంగి ప్రధానకాలువ నుంచి తమ్మిలేరు వరదనీరు చేలల్లో ఎగదనుఉన్నుతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.